క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు అందజేస్తున్న సిబ్బంది

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గ్రామ శివారు ప్రాంతాల ప్రజలందరికీ వరమని సానిగూడెం సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. శుక్రవారం సానిగూడెం వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీఓ పీ.శ్రీలత ప్రారంభించారు. సానిగూడెం శివారు ప్రాంతంలో 235 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, నాయకులు రాజేష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: మేధినరావుపాలెం గ్రామానికి చెందిన ప్రత్యేక అవసరాలు గల వ్యక్తి తానిగడప రాంబాబుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం రూ.11 వేల విలువ గల ట్రై సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మేధినరావుపాలెం ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడికొండ రాజా, జొన్నకూటి మంగరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. లబ్ధిదారుడు తానిగడప రాంబాబు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

పెదవేగి : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెదవేగి మండలం కొప్పాక, పెదకడిమి, అంకన్నగూడెం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచనల మేరకు, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

గణపవరం: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శుక్రవారం ఆయన గణపవరం ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్మీ సిబ్బందితో కలిసి గణపవరం ప్రధాన వీధులలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్, ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గణపవరం మండలంలో ఐదు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని గణపవరం, సరిపల్లె, అర్ధవరం, పిప్పర, మొయ్యేరులో శుక్రవారం పోలీసు, ఆర్మీ సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

క్రీస్తు బాటలో పయనించాలి

పెదవేగి : ప్రతి వ్యక్తి ఏసుక్రీస్తు చూపిన బాటలో పయనించాలని విజయవాడ పీఠం వెలగల గూడెం విచారణ గురువులు ఫాదర్ డానియల్ అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామ విచారణలో రెండవ రోజు క్రీస్తులో నూత్నీకరణ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు విచారణ గురువులు ఫాదర్ రాచూరి బాలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ పరిధిలోని విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నారాయణపురంలో ప్రచారం



నారాయణపురంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ప్రజలంతా మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీ తీసుకురావాలని మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు కోరారు. శుక్రవారం నారాయణపురంలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజు, మాజీ ఉప సర్పంచి అడపా శ్రీను, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, పార్టీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, పంచాయతీ సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.

స్వరాజ్యలక్ష్మికి గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతి

దెందులూరు: గాలాయగూడెం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.స్వరాజ్యలక్ష్మికి గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. దీనికి సంబంధించి శుక్రవా రం జిల్లా పంచాయతీఅధికారి ఆదేశాలు జారీచేశారు. మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు స్వరాజ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సబ్సిడీతో ఆక్వాకు ఊపిరి

- చంద్రబాబు హయాంలో యూనిట్ ధర రూ.3.85
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో యూనిట్ ధర రూ.1.50
- ఆక్వా జోన్ పరిధిలోని 10 ఎకరాల్లోపు రైతులకు వర్తింపు
- నాలుగేళ్లుగా నియోజకవర్గంలో రూ. 258 కోట్ల సబ్సిడీ



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు



నిడమర్రులో చేపల పట్టుబడి

నిడమర్రు: ఒకప్పుడు సిరులు కురిపించిన ఆక్వా సాగులో సాగు విస్తీర్ణం పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా పెరిగాయి. పదేళ్ల వరకూ ఆర్థికంగా ఆశాజనకంగా ఉన్న చేపల, రొయ్యల పెంపకాల్లో వాతావరణంలో మార్పులు, విద్యుత్ చార్జీల భారం, సీడ్, మేతలు, మందుల్లో కల్తీలు, సిండికేట్ల కారణంగా ధరల్లో వ్యత్యాసంతో ఆక్వా రంగం కుదేలవుతున్న తరుణంలో ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆక్వాలో విద్యుత్ చార్జీల్లో రాయితీ ప్రకటించి యూనిట్ ధర రూ.1.50కి అందించి ఆక్వా రంగానికి ఊపిరి పోసారు.

నియోజకవర్గంలో రూ.258 కోట్లు ప్రభుత్వ సబ్సిడీ

ఉంగుటూరు నియోజకవర్గంలో మొత్తం ఐదు విద్యుత్ సెక్షన్లున్నాయి. వీటిలో గుండుగొలను సెక్షన్ మినహా మిగిలిన నాలుగు సెక్షన్స్‌లో ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు చేప, రొయ్య సాగు చేస్తున్న రైతులు వందల మంది ఉన్నారు. ఈ విద్యుత్ సెక్షన్స్ పరిధిలో 22 వేల ఎకరాల వరకూ చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. ఆయా చెరువుల వద్ద 3,908 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 2020 నుంచి నేటి వరకు ఆయా సర్వీసుల్లో విద్యుత్ వినియోగంపై రూ.258.52 కోట్లు ప్రభుత్వ రాయితీ అందించి ఆక్వా రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించింది.

ఆక్వారంగంపై టీడీపీ కపట ప్రేమ

చంద్రబాబు హయాంలో ఆక్వా రంగానికి యూనిట్ ధర రూ.3.85 ఉంది. అనంతరం ఎన్నికల సమయంలో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే రూ.2 యూనిట్ ధర అమలు చేస్తామని చెప్పినా ఆక్వా రైతులు ఆయన హామీని విశ్వసించలేదు.చంద్రబాబుకు ఆక్వారంగం అభివృద్ధిచెందాలనే లక్ష్యం ఉంటే అధికారంలోఉన్న ఏరోజైనా సబ్సిడీ, ప్రోత్సాహకాలు ఇచ్చారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సన్న, చిన్నకారు రైతులకే సబ్సిడీ వర్తించేలా

2020లో ఆక్వా రంగంలోని రైతులకు ప్రభుత్వ రాయితీ కల్పించి చార్జీ యూనిట్ రూ1.50 పైసలకే అందించారు. తర్వాత రూ.5 ఎకరాల్లోపు ఉన్న రైతులకే ఈ రాయితీ వర్తించేలా జీవో తెచ్చారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆక్వా రైతుల కష్టాలు స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో 2022 మే 16న గణపవరంలో నిర్వహించిన రైతు భరోసా సభలో ఆక్వా జోన్ పరిధిలో 5 ఎకరాల్లోపు నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు విద్యుత్ రాయితీ ప్రకటించారు. దీంతో జగన్ హామీ మేరకు అదే ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ఆక్వాలో 10 ఎకరాల్లోపు ఉన్న ఆక్వా రైతులకు యూనిట్ ధర రూ.1.50గా ప్రభుత్వం జీవో తెచ్చింది. 10 ఎకరాలపై బడి ఉన్న ఆక్వా రైతులు 3 శాతం మాత్రమే ఉన్నారు. వారు రూ 3.80కి విద్యుత్ చార్జీ చెల్లిస్తున్నారు. గతంతో పోల్చితే పవర్ ప్రొడక్షన్ ధర బాగాపెరిగింది. ఆక్వా రంగం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఈ విద్యుత్‌రాయితీని ప్రభుత్వం భరిస్తోందని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు.

2019 నుంచి 2024 వరకూ ఆక్వాలో విద్యుత్ రాయితీ

విద్యుత్ సెక్షన్ పేరు	సర్వీసులు	సబ్సిడీ
నిడమర్రు	1,458	రూ.135 కోట్లు
గణపవరం	1,956	రూ.111 కోట్లు
చేబ్రోలు	172	రూ.4.30 కోట్లు
భీమడోలు	322	రూ.8.22కోట్లు
మొత్తం	3,908	రూ.258.52 కోట్లు

నెలకు రూ.70వేల వరకూ ప్రభుత్వ రాయితీ



నేను 9 ఎకరాల వరకూ రొయ్యల సాగు చేస్తున్నా. ప్రతి నెల రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకూ ప్రభుత్వం నుంచి ఆక్వాలో విద్యుత్ రాయితీ పొందుతున్నాను. ఇప్పటికే ఆక్వా సాగులో అనేక సమస్యలున్నాయి. ప్రభుత్వం ఆక్వాకు కల్పించిన విద్యుత్ సబ్సిడీతో రైతులకు కొంత వరకూ భారం తగ్గింది. ప్రభుత్వ ప్రోత్సాహం కారణంగా ఆక్వా సాగును కొనసాగిస్తున్నాం. టీడీపీ ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పూర్తిగా విస్మరించింది.

– పూసల వెంకటేశ్వరరావు, ఆక్వా రైతు, సీహెచ్. అగ్రహారం

ఆక్వా రైతుల సమస్యలు సీఎం జగన్ దృష్టికి



సంక్షోభం వైపు ఉన్న ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2020లో ఆక్వా కల్చర్ డవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి విద్యుత్ సబ్సిడీ అందించి ఆక్వా రైతులను ఆర్థికంగా ఆదుకున్నారు. ఆక్వా రైతుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకు వెళ్లిన తక్షణం విద్యుత్ సబ్సిడీ పరిధి ఆక్వాలో 10 ఎకరాల్లోపు వరకూ వర్తించేలా గణపవరంలో నిర్వహించిన సీఎం బహిరంగ సభలో హామీ ఇచ్చి నేటి వరకూ అమలు చేస్తున్నారు.

– ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఫిబ్రవరిలో రూ. 2.21 కోట్ల ఆక్వా రాయితీ



మండలంలో ఆక్వా జోన్ పరిధిలో ప్రస్తుతం చేపలు, రొయ్యల చెరువులపై 1,384 విద్యుత్ సర్వీసులున్నాయి. ఫిబ్రవరిలో ఆక్వా విద్యుత్ సర్వీసుల వినియోగంపై ప్రభుత్వం అందించిన రాయితీ రూ.2.21కోట్లు. 2020నుంచి ఇప్పటివరకూ నిడమర్రు మండలంలోని ఆక్వా రైతులు పొందిన లబ్ధి రూ.135 కోట్ల వరకూ ఉంది. ఆక్వాచెరువులకు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మార్పువంటివి ఎప్పటికప్పుడు చేస్తూ నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం.

– మురళీ కృష్ణ, ఏఈ, నిడమర్రు

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు

పెదవేగి : బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి హెచ్చరించారు. జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కి అందిన సమాచారం మేరకు పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలికకు బాల్య వివాహం చేస్తున్నారనే సమాచారం రాగా, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ రెవెన్యూ అధికారులు, సచివాలయం మహిళా కార్యదర్శి ఘటన ప్రదేశానికి వెళ్లారు. బాలికకు కౌన్సెలింగ్ నిమిత్తం ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. డీసీపీఓ డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి ఆధ్వర్యంలో బాలికకు, ఆమె తల్లిదండ్రులకు, వరుడికి, అతడి కుటుంబ సభ్యులకు బాల్య వివాహ వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. బాలికకు విద్య, వసతి నిమిత్తం వసతి గృహానికి తరలించినట్టు చైల్డ్ హెల్ప్ లైన్-1098 కోర్డినేటర్ వైవీ రాజు తెలిపారు. కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ఇటీవల బాల్యవివాహాల నిరోధం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాల్లో భాగంగా వధువు, వరుడు తల్లిదండ్రులు నుంచి అఫిడవిట్‌ను పెదవేగి తహసీల్దార్ సూర్యప్రభ, ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తీసుకున్నారు. పెదవేగి సూపర్‌వైజర్ శాంతరత్నం, కొప్పాక సచివాలయం మహిళా కార్యదర్శి కుసుమ హాజరయ్యారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: గోపినాథపట్నంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.3 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో 120 మీటర్ల మేర సీసీ రహదారిని నిర్మిస్తామన్నారు. సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, దళిత విభాగం అధ్యక్షుడు గంటా లక్ష్మణరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి



తోకలపల్లిలో పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం తోకలపల్లిలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రూ.28.76 కోట్లు జల జీవన్ మిషన్ నిధులతో మైక్రోవాటర్ పిల్లర్లు ఏర్పాటు, అదనపు రక్షిత పథకం ట్యాంక్‌లు, పైప్‌లైన్ నిర్మాణాలు వంటి 79 పనులు ఉంగుటూరు నియోజకవర్గంలోని 81 గ్రామాల్లో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్‌లు గణసల కృష్ణకుమారి, వంజరపు సత్యనారాయణ, ఉప సర్పంచ్ గండి చిన్న, పార్టీ అధ్యక్షుడు నల్లకొండలు, బయ్యే విజయ్, బయ్యే దావీదు, ఇసుకపాటి నాగేంద్ర తదితరులున్నారు.

పత్తేపురంలో టీటీడీ దేవస్థానం నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న భజన మందిరం నిర్మాణ శంకుస్థాపన పనుల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రుద్దరాజు అప్పల రాజు, పార్టీ పరిశీలకుడు కూనపురాజు సందీప్, పాత్తూరి శ్రీనివాసరాజు, శాంతి రాజు తదితరులున్నారు.

పార్టీ శ్రేణులకు వాసుబాబు కృతజ్ఞతలు

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ మోటార్‌సైకిల్ ప్రదర్శన విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో సుమారు 40 కిలోమీటర్లు నిర్వహించిన మోటార్‌సైకిల్ ర్యాలీలో వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు.నేతలు, కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో పనిచేసి రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీ తీసుకురావాలని ఆయన కోరారు.

ఎన్నికల సిబ్బందికి నేడు శిక్షణ

ఉంగుటూరు: ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బందికి మీడియా వారికి శిక్షణ ఏర్పాటు చేశామని తహసీల్దారు వెంకటశివయ్య తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు నాలుగు విభాగాలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫ్లయింగు స్క్వాడ్స్‌కి, ఎన్నికల నియమావళి చూసే అధికార్లకు, మీడియా సభ్యులకు, విధుల్లో పాల్గొనే వీడియో గ్రాఫర్లకు, నామినేషన్లు స్వీకరణ సమయంలో పనిచేసే హెల్ప్ డెస్క్ సభ్యులకు శిక్షణ ఉందని చెప్పారు. ఈ శిక్షణకు సకాలంలో హాజరుకావాలని తహసీల్దారు కోరారు. 4బ్యాచ్‌లుగా శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి జేజేలు పలుకుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, నాయకులు



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వెల్లడి
- వంగూరులో 170 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

పెదవేగి : వంగూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం ఆవిష్కరించారు. అబ్బయ్యచౌదరికి వంగూరు గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు, దివంగత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరించి జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.40 కోట్ల నిధులతో గ్రామాభివృద్ధికి బాటలు వేశామన్నారు. గ్రామంలో 4 ఎకరాల భూమి కొనుగోలు చేసి, తొలి విడతగా 170 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ స్థలం కేటాయించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వంగూరు గ్రామ అభివృద్ధికి దాదాపుగా రూ.40 కోట్లు మంజూరు చేశానన్నారు. వంగూరు వైఎస్సార్ సీపీ యువనేత కేశన సతీష్ నాయకత్వంలో వంగూరు అభివృద్ధిలో ముందుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు 70 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, సర్పంచ్ చీలి రూతు, ఎంపీటీసీ మరియమ్మ, బీసీ నాయకుడు ఘంటా ప్రసాద్, కేసిన సతీష్ మాట్లాడారు. గ్రామ సచివాలయ సిబ్బంది, డ్వాక్రా వీఓఏలు, వలంటీర్లు ఎమ్మెల్యేకు మెమెంటోలు, జ్ఞాపికలు, దుశ్శాలువాతో సత్కరించారు. సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



గణపవరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరంలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ సలాది రత్నకుమారి, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, పట్టణ కన్వీనర్ రొంగల శ్రీను, జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు మాదేటి సురేష్, నడింపల్లి సోమరాజు, తెనాలి సునీల్, ఏఎంసీ వైస్ చైర్మన్ గాదిరాజు అబ్బాస్, మూర భాస్కరరావు, ఉండి అంతర్వేది పాల్గొన్నారు.

భీమడోలు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఇంజేటి నీలిమజూనియర్




ఏఎంసీ పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇంజేటి నీలిమను అభినందిస్తున్న పుప్పాల కార్తీక్ తదితరులు

భీమడోలు: భీమడోలు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ముచ్చటగా మూడోసారి ఇంజేటి నీలిమ పదవీ బాధ్యతలు స్వీకరించారు. భీమడోలు లోని ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూరప్పగూడెంకు చెందిన ఇంజేటి నీలిమతో పాటు సభ్యులు ప్రమాణం చేసారు. ఏఎంసీలోని గ్రేడ్ 3 కార్యదర్శి మమత వారితో ప్రమాణం చేయించారు. వైఎస్సార్ సీపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ మాట్లాడుతూ పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు రుణపడి ఉంటానన్నారు. పుప్పాల కార్తీక్, ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, వెజ్జు బాలాజీ, ఎంపీటీసీలు గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, దాసరి విజయభాను, రావిపాటి గాంధీ, రామిశెట్టి శ్రీను, చెరుకూరి మధు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులు వీరే

భీమడోలు ఏఎంసీ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వాసుబాబు, చైర్‌పర్సన్‌గా ఇంజేటి నీలిమ, వైస్ చైర్మన్‌గా పులిచర్ల వెంకటకృష్ణారావు, సభ్యులుగా యడ్ల నాగేశ్వరరావు, ఉయ్యాల కృష్ణ, పంతుల మణెమ్మ,మద్రాపు వెంకట సింహాచలం, సైదు వెంకట రమణ, పిల్లంగోళ్ల లక్ష్మీ, కొండేపాటి ధనలక్ష్మీ, నీలపాల కనకలక్ష్మీ, మంతెన కృష్ణవేణీ, కొండేటి ఆదినారాయణ, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ ఆలీబీ, మద్దుల నరేంద్రకుమార్, భీమడోలు సొసైటీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఏలూరు మార్కెటింగ్ అధికారి, భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి సభ్యులుగా ఉంటారు.

సంక్షేమం, అభివృద్ధిని గడపగడపకూ వివరించండి



పోతునూరు, కొవ్వలి, గోపన్నపాలెం నాయకులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, మౌలికల వసతుల కల్పనను ప్రతి గ్రామంలో గడపగడపకూ వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని పోతునూరు, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్ సీపీకి చెందిన అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రణాళిక, సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. బూత్ కమిటీలు పకడ్బందీగా పనిచేసేలా పార్టీ నాయకులు, గృహసారథులు నిత్యం వారితో మాట్లాడాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రతి లబ్ధిదారుడికి నేరుగా వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించి మద్దతు కోరాలన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమంతో పాటు నవరత్న పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వేమూరి జితేంద్ర, మండల ఉపాధ్యక్షుడు గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గోరిపర్తి వరలక్ష్మి, సర్పంచ్‌లు బోదుల స్వరూప్, ఇంటేటి మధులత గంగాధర్, కోటే నాగమల్లేశ్వరి కుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.